
కథ

'ఆ అమ్మాయే గుర్తొస్తుందిరా...'
'ఇప్పటికి లక్షసార్లు చెప్పావ్.. ఆపరా బాబు'
'రేపు కాలేజీలో ఐ లవ్ యూ చెప్పెయ్‌రా'
'యస్ ఆర్ నో తేలిపోద్ది. ధైర్యం చెయ్'
ముగ్గురు స్నేహితులూ సలహాలు చెప్పారు అనిల్‌కి.

***

# లావణ్య 'యస్' అనలేదు

సర్వేపల్లి సురేష్‌కుమార్



కాలేజీ అయిపోగానే...

'లావణ్యగారూ...' పిలిచాడు అనిల్.

యేంటి నన్ను పిలుస్తున్నాడు.. అనుకుని అతని వైపు సూటిగా చూసి 'చెప్పండి' అంది, చూడలేక కళ్ళు తిప్పుకొంటూ.

'అది... అది... మీతో పర్సనల్‌గా మాట్లాడాలి'

'పర్లేదు చెప్పండి'

కాళ్ళు చేతులు వణుకుతున్నాయ్... శరీరం చల్ల బడిపోయింది. మొత్తానికి వణుకుతూ ధైర్యం చేశాడు.

***

అనిల్‌తో ఇద్దరు స్నేహితులు –

'యేమైందిరా...'

'యేమంది చెప్పరా...'

'మీరంటే చాలా ఇష్టం అనగానే ... చూసి వెళ్ళిపోయిందిరా'

'అంతేగా...'

'కాని... ఇష్టం లేకపోతే తిట్టేదిగా' అన్నాడొకడు.

'కాని లేదు గీని లేదు. రేపు ఓకే చెప్తుంది. అమ్మాయి కదా, టైమ్ తీసుకుంటుంది' అన్నాడు మరొకడు.

రాత్రి పన్నెండవుతోంది.

లావణ్యకి నిద్ర రావట్లేదు.

'అతనేంటి ఇష్టమంటాడు.

నాకు మా నాన్నలా ఆఫీసరవ్వాలనుంది... అదే యిష్టం.

రేపు అతనికి చెప్పాలి, అనవసరంగా ఇలా ఆలోచించవద్దని....'

ఆలోచనలతో నిద్ర...

అనిల్‌కి వెక్కిళ్ళొస్తున్నాయ్.

'లావణ్య నన్నే అనుకొంటుంది. లేకపోతే వెక్కిళ్లెందుకొస్తాయ్'.

'రేపు 'యస్' చెప్పనీ... ఎక్కడికైనా తీసుకెళ్ళి, కూలీపనైనా చేసి అపురూపంగా చూసుకుంటా.'

ఆలోచనలు గిర్రున తిరుగుతున్నాయ్.

పక్కరోజు.

అనిల్ ఎదురుచూస్తున్నా... ఎదురుపడినా లావణ్య మాట్లాడలేదు.

అనిల్ ప్రతి నిముషం 'యస్' చెప్తుందని ఆలోచిస్తున్నాడు.

రోజులు గడుస్తున్నాయ్.

లావణ్య ఇంటికెళ్తుంటే కనిపిస్తున్నాడు.

ఆదివారం కూడా కనిపిస్తున్నాడు.

ఇంటెదురుగా కూడా...

షాపింగ్‌కి వెళ్ళినా... ఆఖరికి ఎక్కడికి వెళ్తున్నా ప్రతిచోటా విరివిగా కనిపిస్తున్నాడు.

రాత్రి పన్నెండవుతోంది. లావణ్య నిద్రించట్లా... అతనేంటి.. యెక్కడికెళితే అక్కడ... ఇష్టమంటే ఇదా...?

నాకు మా నాన్నలా ఆఫీసరవ్వాలని ఇష్టం. ఏమీ చెప్పకుంటే... వదిలేస్తాడనుకున్నా. ఎందుకు నాకు మాత్రమే తెలిసేలా నన్ను ఫాలో అవుతున్నాడు.

అతన్ని మార్చాలి. నా కారణంగా అతను.. అలా...

అసలు అలాంటి ఆశలు వద్దని చెప్పాలి.

ఆలోచనలు...

నిద్ర...

***

'అనిల్ గారూ... అనిల్ గారూ..' పిలిచింది.

సతమతమౌతూ... టెన్షన్‌లో.. పరిగెత్తినట్టొచ్చాడు లావణ్య దగ్గరికి.

'మీలో ఒక పట్టుదల ఉంది. కానీ మీరొక్కరంటే ఇష్టమనేలా ఆలోచించలేకపోతున్నా. దయచేసి స్టడీస్ కంటిన్యూ చేయండి. మన గోల్స్ అన్నీ అయిపోతే ఇలాంటివి ఆలోచిద్దాం' అని చెప్పి వెళ్ళిపోబోయింది.

'నేను ప్రేమిస్తున్నా... నీకోసం ఎంత కష్టపడ్డానో తెల్సా' అనిల్ కొంచెం మొరటుగా అన్నాడు.

లావణ్య వెళ్తూ ఆగింది.

'ప్లీజ్... అనవసరంగా మీరు టైం వేస్ట్ చేస్తున్నారు' – అని చికాగ్గా వెళ్ళిపోయింది.

***

రోజులు గడుస్తున్నాయ్...

అందరిలా నాకూ లవర్ ఉండాలి.

పంతం పెరుగుతోంది అనిల్‌లో.


కావాలని నాటకాలాడుతోంది. విషయం తేల్చేస్తా. భావాలు సంస్కారం మరచిపోతున్నట్టయిపోయాయ్.

మత్తులో... ఆ నలుగురిలో

'ఇక మర్చిపోరా.. ఎలాగూ గ్రీన్ సిగ్నల్ ఇచ్చేలా లేదు.'

'నోర్ముయ్యండ్రా... లావణ్య నాది'

'అందరిలో నవ్వులు. ఈ మాట చాలాసార్లు విన్నాం.'



'రేపు చెప్తా...' అన్నాడు అనిల్ కోపంగా.

'అంత సీన్ లేదు...'

'కావాలంటే పందెం. రేపు ఫేర్‌వెల్‌లో విషయం తేల్చేస్తా. ఐ లవ్ యూ చెప్పించుకొంటా.'

'లేకపోతే...' ఒకడన్నాడు.

మత్తు ప్రపంచం... నిజానికి దూరంగా బ్రతికే ప్రపంచం.

'లేకపోతేనా... జీవితాంతం మీ బానిసనై, చదువు మాని మీకు ఊడిగం చేస్తా...'

అందరూ కేర్‌లెస్‌గా వున్నారు.

అనిల్ అందర్నీ కోపంగా చూస్తున్నాడు.

మత్తులో నవ్వులు... పంతాలు.. పందేలు... ఛాలెంజ్‌లు.

***

''ఇంటర్‌మీడియట్ కళాశాల వార్షికోత్సవం''

పెద్ద బోర్డు దూరంగా కనిపిస్తోంది. ఓపెన్ ఎయిర్ థియేటర్‌లోనుంచి మైకు శబ్దాలు.

'అమ్మో మొదలై చాలాసేపైనట్టుంది' అనుకొని సైకిల్ ఫాస్ట్‌గా పోనిస్తూ,ఎడమ చేతితో కర్చీఫ్‌తో మొహం తుడుచుకుంటూ థియేటర్‌కి దగ్గరైంది లావణ్య. వందల సైకిళ్ళతో నిండిపోయిన పార్కింగ్‌లో స్థలం లేకపోయినా సైకిల్ ఇరికించేసి పరిగెత్తినట్టు నడుస్తూ లోపలికెళ్ళింది.

ఎప్పటినుంచి గోడపక్కన ఎదురుచూస్తున్నారో ఆ నలుగురు అనిల్‌కి ఆమె ప్రతి కదలిక అందిస్తూ రెచ్చగొడుతున్నారు.

రకరకాల నృత్యాలు.

మిమిక్రీ...

సినిమా పాటలకు డ్యాన్సులు...

భరతనాట్యం...

అర్థమయ్యి కానట్టున్న ప్రసంగాలు...

అన్నీ అయిపోగానే, బహుమతుల ప్రదానం.

'ఇంటర్‌మీడియట్ మొదటి సంవత్సరానికిగాను అత్యధిక మార్కులతో నిలిచిన ఉత్తమ విద్యార్థిని చిరంజీవి లావణ్య'

చప్పట్లు... చప్పట్లు... మారుమోగుతున్నాయ్.

అనిల్‌లో గర్వం. స్నేహితులను చూస్తూ 'దటీజ్ లావణ్య' అంటూ ఆనందిస్తున్నాడు.

నా లావణ్య... నా లావణ్య... నా లావణ్య పదే పదే అరుస్తున్నాడు స్నేహితుల ముందు.

ఆమె ప్రమేయం లేకుండా అతను ఆమెను తనది అని ప్రకటించుకున్నాడు.

'రేయ్ ఈరోజు కూడా తేల్చుకోలేదనుకో. ఇక నువ్ అంతే... తర్వాత సెలవులు.. పరీక్షలు.. మళ్ళీ సెకండియర్' ఒకడన్నాడు.

'అంత గ్యాప్‌లో ఏదైనా జరగవచ్చు... మేము నీ పక్కనే ఉంటాం' ఇంకోడన్నాడు.

అనిల్‌కి చెమటలు పడుతున్నాయ్.

ఇదే లాస్ట్ ఛాన్స్... యేం చేయాలి అనే ఆలోచన.

వాళ్ళు లావణ్యను చూస్తూనే వున్నారు.

అప్పటికే చాలా సమయమైపోతోందని కొందరు వెళ్ళిపోతున్నారు.

అనిల్‌లో యుద్ధం జరుగుతోంది.

'యెలాగైనా మాట్లాడాలి' పదేపదే అదే మననం చేస్తున్నాడు.

గుండె కొంచెం వేగంగా కొట్టుకుంటోంది.

రిలాక్స్ అవడానికి గాలి మొత్తం వదిలి... పీల్చి ఎనర్జీ తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు.

ఇంకా ఫంక్షన్ ఫినిషింగ్ టచ్ ఇవ్వకుండానే తన బహుమతులను సర్దుకుంటోంది లావణ్య.

లావణ్య వెళ్లడానికి సిద్ధమైందని అర్థమైంది అనిల్ అండ్ గ్రూప్‌కి.

'రేయ్ వెళ్తోందిరా... వెళ్ళరా'

'ఫాస్ట్‌గా వెళ్ళరా...'

'మనం వెనకనుంచి వెళ్దాం. పెద్దచెట్టు దగ్గరకెళ్దాం..'

తలా ఓ సలహా ఇస్తున్నారు అనిల్‌కి.

పెద్దచెట్టు కింద అనిల్, వెనక ముగ్గురూ వెయిట్ చేస్తున్నారు.

***

కళ్ళద్దాలతో టి.వి. చూస్తున్నాడు నలభైయేళ్ళ వ్యక్తి. డైనింగ్ టేబుల్ మీద అన్నీ సర్దుతూ

'టి.వి. చూస్తూ ఎంత ప్రశాంతంగా ఉన్నారండీ... ఇంకా పాప రాలేదనేమన్నా వుందా... అయినా అర్ధరాత్రి వరకూ ఏం ఫంక్షన్లో. చేసేదేదో ఉదయం చేసుకోకూడదా..'

ఆమెని చూసి చిన్నగా నవ్వుతూ 'రాత్రి తొమ్మిది గంటలకే అర్ధరాత్రంటున్నావ్. పైగా ఫేర్‌వెల్ ఉదయం చేయాలంటావ్. ఎప్పుడైనా కాలేజీని బైట నుంచైనా చూస్తే కదా... కష్టపడి ఎనిమిదో క్లాస్ అయిందనిపించావ్' అన్నాడాయన.

'ముందు కాలేజీకి ఫోన్ చెయ్యండి. తర్వాత మన చదువుల గురించి చర్చించుకుందాం. మీ మార్కుల లిస్ట్ ఒరిజినల్స్ నా దగ్గరే వున్నాయి' అంటున్నామె మాట పూర్తి కాకుండానే.

'ఫోన్ చేస్తాలే... గతం తవ్వకు. అందుకే నువ్వంటే నాకు...' అంటూ ఆమె ఓరచూపుని చూసి ఆపేశాడు. ఇద్దరూ నవ్వుకొని ఫోన్ చేశాడు.

***

'హలో...'

'హలో... నేను లావణ్య వాళ్ళ డాడీని...'

'చెప్పండి'

'ఫంక్షన్ అయిపోయిందా... యింకా పాప ఇంటికి రాలేదు'

'అయిపోయి అరగంటైంది సార్. ఈపాటికి వచ్చేసుండాలే'

థాంక్ యూ... గుడ్‌నైట్ చెప్పేలోపు ఆవైపు ఫోన్ పెట్టేసిన శబ్దం.

ఫోన్ పెట్టేసి ఆమెని చూశాడు.

ఆలోచన...

'సరే నేనలా వెళ్ళొస్తా...'

'మీ ఇష్టం'

'బండి తాళాలీ...'

తొమ్మిది గంటలా పది నిముషాలు చూపుతోంది గోడ గడియారం.



మొహం కనపడకుండా నల్లగుడ్డ కప్పుకొని లావణ్య ఇంటి పెరటివైపు గోడ దూకాడతను. అనిల్ లాగానే ఉన్నాడు. ఒక చేత్తో కత్తి పట్టుకొని... నేరుగా లావణ్య రూమ్‌వైపు వచ్చాడు. చిన్నగా అడుగులో అడుగేసుకుంటూ.. ఆమె దగ్గరకొచ్చి కత్తి మెడపై ఉంచి నిద్రలేపాడు. 'నీకోసం ఎంత రిస్కయినా ఫేస్ చేస్తా... కమాన్ ప్రేమిస్తున్నానని చెప్పు'
లావణ్యకి చెమటలు పట్టాయి.
'చెప్తావా లేదా' అంటూ ఆవేశంగా కత్తిని గొంతుపై లాగాడు.
తెగింది...
రక్తం...
డాడీ... అరిచింది.

***

పెద్ద చెట్టు దగ్గర...

'సైన్ దాటింది నన్ను వెళ్ళనీ...'

'లావణ్యా.. సీరియస్‌గా అడుగుతున్నా. నన్ను ప్రేమిస్తున్నావా లేదా...'

'నాకలాంటివి ఇష్టముండవ్'

అనిల్ సైకిల్ హ్యాండిల్‌ని కదలకుండా పట్టుకోనున్నాడు.

లావణ్యలో అసహనం...

'యేదన్నా వుంటే రేపు మాట్లాడుకుందాం...' అనీజీగా అందామె.

'నాకిప్పుడే చెప్పు... ప్రేమిస్తున్నావా లేదా'

'ప్లీజ్ రేపు ఖచ్చితంగా మాట్లాడుకొందాం...'

'నో... ఇప్పుడే చెప్పు...'

'నీకేమైనా పిచ్చా'

'మొదటిరోజు నుంచీ నువ్వంటే ఇష్టం... ఇప్పుడు కాదన్నావనుకో' అనిల్ మొరటుగా అన్నాడు... రాక్షసుడిలా – కొంచెం దూరంలో ముగ్గురు నిలబడి వున్నారు.

లావణ్య మౌనంగా నిలబడిపోయింది.

ఆలోచన...

'ఇష్టాన్ని ఇంత బలవంతంగా ఒప్పించాలా, వెనక ముగ్గుర్ని తెచ్చుకొనే ధైర్యం లేనివాడంటే నాకెందుకు భయం' అని ఆలోచిస్తూ...

'అనిల్, చిన్న విషయాన్ని పెద్దది చెయ్యకు. అనవసరంగా రిస్క్‌లో పడతావు. నీమీద కంప్లయింట్ చేస్తా..'

'బ్రతిమాలుతుంటే వినవా. సరే ఇప్పుడు చెప్తున్నా. నువ్వు ప్రేమిస్తున్నావని చెప్పేసే నిన్ను వదిలేది... ఏం చేస్తావో చేస్కో... ఎవర్నైనా పిలుచుకో...' – గొంతులో వాల్యూమ్ పెరిగింది అనిల్‌కి.

లావణ్యలో లోలోపల సన్నని భయం మొదలవుతూ వుంది. చెమట ఎక్కువవుతోంది.

'నువ్వు సరే అంటే ఎవర్నయినా ఎదిరిస్తా' అని అనిల్ అంటుండగానే దూరంగా లైట్ వెలిగింది. ఏదో వెహికిల్ వస్తున్న శబ్దం.

పక్కనున్న ముగ్గుర్లోంచి...

'రేయ్ వెళ్దాం ఎవరో వస్తున్నారు...'

'అదిగో ఎవరో వస్తున్నారు. ఇప్పటికైనా చెప్పు..'

లావణ్య మౌనం.

లైట్ వెలుతురు దగ్గరవుతోంది.

'రేయ్ వచ్చెయ్...' అరుస్తున్నారా ముగురు.

'ప్లీజ్ లావణ్యా... ఐ లవ్ యూ సోమచ్'

మౌనంగా వుందామె.

'రేపటివరకూ టైమిస్తున్నా ఆలోచించుకో... నో అన్నావంటే విషయం పెద్దదవుతుంది... ఎంత దూరమైనా వెళ్తా. అసలు రేపు నీచేత నేనిష్టమని చెప్పించుకొంటా' గంభీరంగా వార్నింగ్ ఇచ్చాననుకొని చెట్ల వెనక్కి వెళ్ళాడు అనిల్. నిముషంలో నలుగురూ చీకట్లో కలిసిపోయారు.

స్కూటర్ లైట్ లావణ్య దగ్గరకొచ్చింది.

'డాడీ... మీరు..'

'ఇక్కడేం చేస్తున్నావ్‌రా..'

'అది... అది... ఆ... సైకిల్ చైన్ పడింది. వేస్కొని వస్తున్నా.'

'సారీరా.. నెక్స్ట్ ఇయర్ వెహికిల్ కొందాం... ఓ.కె..'

మనసారా నవ్వింది. ప్రేమలో వున్న వ్యత్యాసం అర్థమైందామెకి. సైకిల్‌తో సమానంగా స్కూటర్ నడుపుతూ.. నవ్వుతూ... ఇంటికొచ్చేశారు.

ఇంట్లో మరో ప్రేమ ఎదురుచూస్తోంది.

తండ్రీ కూతుర్లు రాగానే

'సైకిల్ చైన్ పడిందట' అన్నాడు లోపలికొస్తూ.

'అనుకొన్నా.. అలాంటిదేదో అయ్యుంటుందని. మీ నాన్న మాట విని సైకిళ్ళు తొక్కితే అలానే వుంటుంది. అసలు బండి కొనిస్తేగాని నువ్వు కాలేజీకి వెళ్ళొద్దు పాప... ఇలా అర్థరాత్రి, అపరాత్రి చైన్లు పడుతుంటే ఆయనొచ్చి వెయ్యడు.'

'ఇది మరీ బాగుంది. తల్లీకూతుర్లు నామీదకొచ్చారు...'

'అదంతే.. ఇక తిందాం రండి' అంటూ ఆమె లోపలికెళ్ళింది.

ఈ సంభాషణ లావణ్యకి వినపడడం లేదు. అసలు ఆ టైమ్‌లో నాన్న రాకపోతే అనే ఆలోచన వస్తే భయమేస్తోందామెకి.

'తినేసి రెస్ట్ తీస్కోరా. బడలిక తగ్గుతుంది. డల్‌గా కనిపిస్తున్నావ్' అన్నాడు.

మౌనంగా లోపలికెళ్ళింది. నీళ్ళు మొహంపై చల్లుకుని ఆలోచిస్తూ సగం తుడుచుకొని డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చుంది. అలా అలా రెండు మెతుకులు ఆడించి లేచి వెళ్ళిపోయింది.

'పాపం బాగా నిద్రొస్తున్నట్టుంది' అందామె.

లావణ్య బెడ్‌రూమ్‌లో లైట్ ఆగిపోయింది.

లావణ్య కళ్ళు మూసుకుని వుంది.

మొహం కనపడకుండా నల్లగుడ్డ కప్పుకొని లావణ్య ఇంటి పెరటివైపు గోడ దూకాడతను. అనిల్ లాగానే ఉన్నాడు. ఒక చేత్తో కత్తి పట్టుకొని... నేరుగా లావణ్య రూమ్‌వైపు వచ్చాడు. చిన్నగా అడుగులో అడుగేసుకుంటూ.. ఆమె దగ్గరకొచ్చి కత్తి మెడపై ఉంచి నిద్ర లేపాడు. 'నీకోసం ఎంత రిస్కయినా ఫేస్ చేస్తా... కమాన్ ప్రేమిస్తున్నానని చెప్పు'

లావణ్యకి చెమటలు పట్టాయి.

'చెప్తావా లేదా' అంటూ ఆవేశంగా కత్తిని గొంతుపై లాగాడు.

తెగింది...

రక్తం...

డాడీ... అరిచింది.

కళ్ళు తెరిచింది. చుట్టూ చీకటి. భయంకరమైన కల. చెమటలతో నడిసిపోయుందామె.

శ్రీ ఆంజనేయం... ప్రసన్నాంజనేయం.

మళ్ళీ నిద్రపోవడానికి ప్రయత్నిస్తోంది. నిద్రంటేనే భయం.

చిన్నగా లేచి 'మమ్మీ.. మమ్మీ..'

బెడ్‌రూం తలుపు తట్టింది.

వెనకెవరో వెంటాడుతున్న వణుకు తగ్గడం లేదామెకి.

అమ్మ వచ్చి తలుపు తీసింది.

ఎదురుగా తడిసిపోయిన లావణ్య.

'ఏమైంది పాపా...'

'నేనూ ఇక్కడే పడుకుంటా' అంటూనే లోపలకెళ్ళి నాన్నపక్కన పడుకొంది.

నాన్న గుండెమీద చెయ్యి పెట్టింది. నిజమైన ధైర్యం లావణ్యలో చిన్నచిన్నగా వచ్చింది.

తనకోసం కొన్ని వేలమందితో యుద్ధం చేసేంత ధైర్యం ఆ గుండెలో స్పర్శించిందామెకి.

అమ్మ వచ్చి పక్కన పడుకొంది 'ఏంటమ్మా...'

'నిద్ర రావట్లేదా... దిష్టి తీసేదా' అడిగింది.

'వూహుఁ... ఏదో పీడకల' అంది లావణ్య.

'ఆంజనేయస్వామిని తలుచుకొని కళ్ళు మూసుకుని పడుకో'

మౌనంగా ఆలోచిస్తోంది లావణ్య.

'నాన్న గుండెలోంచి స్పర్శించిన ధైర్యం చాలు... మీ ఇద్దరి మధ్యలో ఇంకా భయానికి చోటెక్కడుంది. అంతా

ప్రశాంతత' అనుకుంటూ...

కళ్ళు మూసుకుని, చిన్నపాపలా బడలిక వదిలిన స్వచ్ఛమైన వదనంతో... చెమటారిపోయి అందంగా నిద్రపోతోంది.

***

'అనిల్‌కుమార్ నాన్న మీరేనా...' క్లాత్ స్టోర్ అప్పుడే తెరిచి సర్దుతున్న గుమాస్తానడిగాడు వొకాయన.

'అవునండీ అనిల్ మా అబ్బాయి.'

'కాలేజీ దగ్గర వాటర్ ట్యాంక్ ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని అరుస్తున్నాడు... ఎవరెన్ని చెప్పినా వినట్లా...'

తండ్రి హృదయం... ప్రేమ...

లో బి.పి, హై షుగర్, ఆయాసం అన్నిటిని మరిచిపోయి రోడ్లో పరిగెత్తుతున్నాడాయన.

వాటర్ ట్యాంక్ చుట్టూ జనాలు.

ముందు టి.వి. ఛానల్ వాళ్ళు. లైవ్ టెలికాస్ట్. మంచి ఫోజుకోసం ఎదురుచూస్తున్న ప్రింట్‌మీడియా వాళ్ళు కెమెరా సెట్ చేసుకుంటున్నారు.

పైనుంచి అనిల్ అరుస్తున్నాడు. తెల్లపేపర్లపై రాసి కిందికి వదుల్తున్నాడు.

నాది స్వచ్ఛమైన ప్రేమ...

లావణ్యను ప్రేమించాను...

నాకిప్పుడే పెళ్ళి చేయాలి... లేకపోతే దూకేస్తా.

రకరకాల అరుపులు... కాగితాలు పైనుంచి.

అనిల్ తల్లిదండ్రులు పేపర్లు ఏరుకుని చదువుతున్నారు.

నీది స్వచ్ఛమైన ప్రేమైతే మరి మాది... చాలా ప్రశ్నలు ఆ తల్లిదండ్రుల్లో.

లోకంలో ఎన్ని ప్రేమలున్నాయో ఆలోచిస్తున్నారు కన్నీళ్ళతో... ప్రేమ చెమ్మతో.

లావణ్య ఇంట్లో ఫోన్ రింగ్ అయింది.

అమ్మ ఫోనెత్తింది. 'హలో...'

'హలో... ఇది లావణ్య ఇల్లేనా...'

'అవును... మరి మీరు...'

'మీ అమ్మాయిని వెంటనే తీసుకొని కాలేజీ వాటర్ ట్యాంక్ దగ్గరికి రండి.'

'ఎందుకు...'

'ముందు రండి... ఇక్కడ అబ్బాయి దూకేస్తానంటున్నాడు'

లావణ్య నాన్న వచ్చాడు.. 'ఆదివారం ఉదయాన్నే ఆఫీస్ నుంచి ఫోనా' అసహనంగా అన్నాడు.

ఫోన్‌లో ఏమీ మాట్లాడకుండా వుందామె.

'హలో... హలో.. మేడమ్.. మేటర్ చాలా సీరియస్‌గా ఉంది.'

'ఏమండీ... ఫోన్' అంటూ భర్తకిచ్చేస్తూ 'ఎవడో దూకేస్తాడటండీ' భయంగా అందామె.

అతనందుకొని 'హలో.. ఎవరు?'

'సార్... లావణ్యని వెంటనే తీసుకురాకపోతే అతను దూకేసేలా ఉన్నాడు'

లావణ్య నాన్న విషయం విని 'ఇప్పుడే వస్తున్నాం'.

అప్పటికి...

బెడ్‌రూంలో ఇంకా లావణ్య నిద్రపోతూనే వుంది.

అమ్మ, నాన్నతో లావణ్య వచ్చేసరికి జనాలం దరూ దారి వదిలారు. అప్పటికే లావణ్య ఫోటోలు తీసేస్తున్నారు. ఏం జరుగుతుందో మెల్లగా అర్థం చేసుకున్నారు ముగ్గురూ... పేపర్లపై అక్షరాలు చదివారు.

ఐ లవ్ యూ లావణ్య.

వెంటనే పెళ్ళి చేయకపోతే దూకేస్తా.

ఇంకా యేవేవో చదువుతున్నారు.

లావణ్యకి భయమేసింది. నాన్న గుండె మీద చెయ్యివేసింది. నాన్నను గట్టిగా పట్టుకొంది.

'ఇలానే ఏడిపిస్తున్నాడు, డాడీ' సన్నగా గొణిగింది.

కూతురు కళ్ళలో చెమ్మ... ఆగ్రహం తెప్పిస్తోంద తనికి.

అనిల్ తల్లిదండ్రులు అందరికీ దణ్ణం పెడుతున్నారు.

'మా బాబుని కాపాడండి' పెద్దగా అరుస్తున్నారు. పోలీసులు వలలు తెస్తున్నారు.

లావణ్య తల్లిదండ్రులకి ఏం చేయాలో అర్థంకాలేదు.

'ప్రేయసి కాఠిణ్యం...' లావణ్య ఫోటో.

లావణ్య ఒంటరిగా ఏడుస్తోంది.

ఆలోచన...

కనీసం నవ్వడానికి కూడా చనువు ఇవ్వలేదే... మాట్లాడాలంటే ముగ్గుర్తో వచ్చే పిరికివాడు, స్కూటర్ లైట్ కనిపిస్తే చీకట్లో కలిసిపోయే పిరికివాడు. అసలు జీవితంలో పోరాటం చేయలేని చావుని అస్త్రంగా వాడుకొన్న పిరికివాడు.

ఉన్మాదిలా మారాడెందుకు... నాకోసమా... నేనెప్పుడూ కాదనలేదే... అవునని అనలేకపోతున్నానంతే...


ఇష్టపడడం ఒకరి వంతేనా..

మా నాన్నలాంటి గుండె కావాలి నాకు.

స్పర్శిస్తే భయం మాయమవ్వాలి, ప్రేమగా పలకరించాలి.. ప్రేమగా.

అసలు ప్రేమించాను అనే పదానికన్నా మనం బాగా చదువుకొని పెళ్ళి చేసుకుందాం... అని అడిగుంటే ఆలోచించేదాన్నేమో.

నాన్న చెయ్యి భుజంపై పడింది.




'బాబూ వచ్చెయ్... మాట్లాడుకుందాం' అరిచాడు.

నాన్నని ఒకసారి చూసింది లావణ్య. అనిల్ మీద కూడా ప్రేమ వున్న నాన్నని చూసి గర్వించింది.

అనిల్ అందర్నీ చూస్తున్నాడు.

అందరూ పైకి చూసే ఏదేదో అరుస్తున్నారు.

'విషయం త్వరగా తేల్చండి...' అంటూ చౌపట్టు మీదకి ఎక్కబోయాడు.

జారింది.. పట్టు తప్పింది. భూమి ఆకర్షణ బలంగా లాగింది.

***

టి.వి. చూస్తున్న ప్రేక్షకుల ఒళ్ళు జలదరించింది. తర్వాత రోజు..

'ప్రేమకు బలైన ఇంటర్ సెకండియర్ విద్యార్థి'

రక్తపు మడుగులో అనిల్ ఫోటో...

ఇన్‌సెట్‌లో ఫైల్ ఫోటో...

'ఆలోచించకమ్మా... మన ప్రమేయం లేకుండా చాలా జరుగుతాయి.'

లావణ్య నాన్న గుండెకోసం వెతికింది... స్పర్శించింది. ధైర్యం పాకింది. గుండ్రని కళ్ళతో ప్రపంచాన్ని చూసింది.

నిజమైన ప్రేమ.. తాకితే ధైర్యం పాకాలి.. ప్రసరించాలి... అనిల్ గుండెని ఊహలో స్పర్శించింది.

చచ్చే ధైర్యమేగాని బ్రతికించే ధైర్యం లేదనిపించిందామెకి.

"మా నాన్న గుండె చప్పుడు వినలేదు... స్పర్శించలేదు. అందుకే ఇలా చేశానంటున్నాడు సిగ్గుతో... అనిల్, ప్రపంచం వైపు చూసి..."

వినేవాళ్ళెవరున్నారు?

★